# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

# కనకరాజు కనబడ్డాడా?

-కస్తూరి మురళీకృష్ణ

అప్పటికి నాకింకా ఉద్యోగం రాలేదు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ ఉట్టిగా ఉండడం ఎందుకని ట్యూషన్లు చెప్పడం ఆరంభించాను.

నేను ఇతర ట్యూషన్ మాస్టర్లలా కాక పిల్లల్ని నాతో సమానంగా చూస్తూ అందరం కలసి చదువు నేర్చుకుంటున్నట్లు ప్రవర్తిస్తూ వారితోపాటు ఓ విద్యార్థిలా మెలిగేవాడిని. దాంతో పిల్లలు నన్ను ఆరాధించడం ఆరంభించారు. వీరిద్వారా నా గురించి విన్న ఇతరులు నా ట్యూషన్‌లో చేరాలని ఆత్ర పడసాగారు. ఇక్కడ చేర్పించమని తమ తల్లిదండ్రులను వేధించసాగారు.

అయితే నేను ట్యూషన్ చెప్పేందుకు ఎంచుకునే స్టూడెంట్లకి ఒక అర్హత వుండాలి. వాళ్లకు యాభై మార్కులకన్నా తక్కువ మార్కులు రావాలి. అంతకన్నా ఎక్కువ వచ్చేవారిని నేను తీసుకునేవాడిని కాను.

దీన్లో ఓ వ్యాపార రహస్యం వుంది. ఎప్పుడూ 70, 80 మార్కులు వచ్చే వాడికి ఒక్క మార్కు తక్కువ వచ్చినా తల్లిదండ్రులకు అసంతృప్తిగా అనిపిస్తుంది. అదే 30, 40 దాటి రానివాడికి ఒక్క మార్కు ఎక్కువ వచ్చినా తల్లిదండ్రులకు ఎంతో ఆనందంగా అనిపిస్తుంది.

ఓరోజు నా ట్యూషన్ గది ముందు కారు ఆగడంతో పాఠం ఆపి అవైపు చూసాను. కార్లోంచి ఓ నడివయసు స్త్రీ దిగింది. బాబ్డ్ హెయిర్, ఆధునికత ఉట్టిపడే దుస్తులు, లిప్‌స్టిక్...చూడగానే హైసొసైటీ లేడీ అని అర్ధమైంది.

హైహీల్స్ షూస్ టకటకలాడిస్తూ గదిలోకి అడుగుపెట్టింది. పిల్లలు నేలమీద కూచున్నారు. నేను సామాన్యమైన దుస్తుల్లో ఉన్నాను. గది కూడా చిన్నది. ఆమె అప్రియంగా గదంతా కలియజూసింది.

కారువైపు తిరిగి ''కమాన్'' ఆజ్ఞాపించింది.

కారులోంచి ఓ పిల్లవాడు దిగాడు. కీ ఇచ్చిన రోబోట్‌లా వచ్చి ఆమె వెనుక నుంచున్నాడు.


''కనకరాజు! మా అబ్బాయి. వీడికి ట్యూషన్ చెప్పాలి'' ఇంగ్లీషులో చెప్పిందామె.

''ఎన్ని మార్కులొస్తాయ్?'' అడిగాను.

''ఇంతకుముందు తొంభైపైన వచ్చేవి. ఈమధ్యనే మరీ తగ్గిపోయాయి. ముప్పై నలభై దాటటంలేదు'' ఆందోళన ధ్వనించింది ఆమె స్వరంలో. నేను కనకరాజువైపు చూసాను. అతను తల వంచుకుని బుద్ధిమంతుడిలా నిలబడి వున్నాడు. నేను నా ఫీజు చెప్పాను.

ఆమె వెళ్ళబోతూ ఆగి ''హోమ్‌వర్క్ ఎక్కువ ఇవ్వండి. అల్లరి చేస్తే కొట్టండి. మరీ చనువు ఇవ్వకండి. ముందే మావాడు అల్లరి పిల్లవాడు'' అంది కఠినంగా.

నేను కనకరాజువైపు చూసాను. తల వంచుకుని నిలబడి వున్నాడు.



''చూడండి నా ట్యూషన్ నా సామ్రాజ్యం లాంటిది. ఇక్కడ నేనే రాజును. నేనేం అనుకుంటే అది న్యాయం. మీకు కావలసింది మీ పిల్లవాడికి విద్య రావడం. అది నేనెలా నేర్పిస్తాను అన్నది నా ఇష్టం. మీ సలహాలు ఈ విషయంలో అనవసరం'' అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలని నాకు తెలుసు.

ఆమె ముఖం ఎర్రబడింది. బహుశా ఆమెకెవ్వరూ ఎదురు మాట్లాడడం అలవాటు లేదనుకుంటాను. కోపంగా ఏదో అనబోయింది. కానీ మాట్లాడకుండా గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది.

ఆమె వెళ్ళేదాకా పిల్లిలా వున్న కనకరాజు ఆమె వెళ్ళగానే పులిలా తయారయ్యాడు. నేను గదిలోకి వచ్చేలోగా ఒక పిల్లవాడి బుగ్గ గిచ్చాడు. మరో పిల్లవాడి పుస్తకం చింపేసాడు. ఇంకో పిల్లవాడి జుట్టు పీకే ప్రయత్నంలో ఉన్నాడు. నేను గదిలో అడుగుపెట్టగానే పిల్లవాడి జుట్టు వదిలి వంకరగా నవ్వి 'ఏం చేస్తావో చెయ్యి' అన్నట్టు చూసాడు నావైపు.

నాకు కనకరాజు మనస్తత్వం అర్ధమయింది.

పిల్లలు కొండపై నుండి దూకే జలపాతధారలాంటి వారు. తల్లిదండ్రులు అనేక కారణాలవల్ల తన భయా



## 60 మైళ్లు!

ఒక జిల్లా ఆఫీసరు క్యాంపుకు వెళ్లి, తాను 60 మైళ్లదూరం వెళ్లి వచ్చినట్లుగా, ట్రావెలింగ్ ఎలవెన్స్‌ను కోరాడు. ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ అది చూసి, ఆఫీసరు ప్రయాణం చేసినది 58 మైళ్లు మాత్రమే, 60 మైళ్లు కాదని నోట్ వ్రాసి, ఎలవెన్స్‌ను తిరస్కరించాడు. చాలారోజులపాటు వారిద్దరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి ఈ విషయంలో.

ఒక రోజున ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ తనగదిలోని టేబులుమీద ఓ అతిపెద్ద పార్శిల్‌పెట్టి ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు. వెంటనే దాన్ని వూడ తీసి చూశాడు. అదొక మైలురాయి. దానిమీద 60 మైళ్లు అని పెద్ద అక్షరాలతో చెక్కబడి ఉంది. ఆవిధంగా తాను 60 మైళ్లు ప్రయాణం చేశానని, ఆఫీసర్ రుజువుచేశాడు. ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ మొహం మాడింది!

## మమ్మీ, డాడీ!

3 సం.రాల సురేష్ కాన్వెంట్‌లో చేరడానికి వెళ్లి, ప్రిన్స్‌పాల్ ముందు నిలబడ్డాడు.

''బాబూ! మీ అమ్మానాన్నల పేర్లేమిటి?'' ప్రిన్సిపాల్ అడిగాడు.

''మమ్మీ, డాడీ!'' చెప్పాడు ఆ బాలుడు!

## దొంగతనం!

జడ్జి: ఇంత పెద్దదొంగతనాన్ని నువ్వు ఒంటరిగానే చేశావా?

దొంగ: అవునుసార్! ఈరోజుల్లో మనం ఎవర్నీ నమ్మకూడదు! అంచేత ఒంటిచేత్తో ఆపని చేశాను.

- కొడిమెల

లను, ఆందోళనలను, అభిప్రాయాలను అంక్షల రూపంలో, కట్టడి రూపంలో పిల్లలపై రుద్దుతారు. దూకే జలపాత ధారను అడ్డుకట్ట కట్టడం లాంటిది.

పిల్లలు ఆ అడ్డుకట్టలో ఒదిగి వున్నట్లు నటిస్తారు. కానీ ఆ అడ్డు తొలగిన మరుక్షణం విజృంభిస్తారు. అడ్డువల్ల నీటిధార అటూ ఇటూ పరుగెత్తినట్టు వారి శక్తి కూడా చెల్లాచెదురైపోతుంది. తమకూ వ్యక్తిత్వం వుందని నిరూపించుకునే ప్రయత్నం అది. నేను కనకరాజుని పట్టించుకోకుండా పాఠం ప్రారంభించాను.

అయితే అతని అల్లరి శృతి మించడంతో మిగతా పిల్లలందరినీ ఒకవైపు, కనకరాజుని ఒక్కడిని మరోవైపు కూచోబెట్టారు. అతడికేం చేయాలో తోచలేదు. దూరంనుంచే మిగతా వారిని వెక్కిరించసాగాడు. అతడిని ఎవరూ పట్టించుకోవద్దని చెప్పాను. ఎంత వెక్కిరించినా ఎవరినుంచీ స్పందన రాకపోవడంతో కాస్సేపటికి నిశ్శబ్దంగా అయిపోయాడు. తరువాత మిగతా పిల్లలద్వారా కనకరాజు గురించి తెలిసింది.

కనకరాజు తండ్రి డాక్టరు. తల్లికేదో వ్యాపారం వుంది. ఎప్పుడో తప్పించి ఇద్దరూ ఇంట్లో వుండరు. వున్నప్పుడు ఏదో ఒక విషయంలో కనకరాజుకి తిట్లు పడుతూంటాయి. ఒకరకంగా చూస్తే కనకరాజుని వాళ్ళు ఉక్కుపిడికిలితో పెంచుతున్నారు. అయితే పిడికిలి ఎంతగా బిగిస్తే ఇసుక అంతగా జారిపోతుంది. వాళ్ళు కనకరాజునెంత క్రమశిక్షణలో పెడుతూంటే కనకరాజు అంత అల్లరి వాడవుతున్నాడు. కనకరాజు ఏం చేయాలనుకుంటున్నాడో అన్నది ఆలోచించకుండా వాళ్ళు కనకరాజు ఎలా ఉండాలనుకుంటున్నారో అలా ప్రవర్తించేట్టు చేస్తున్నారు.

అయితే ఎంత అల్లరిపిల్లవాడయినా ఇతర పిల్లల్లాగే అతడిలోనూ మెప్పుదల కోసం తపన వుంది. అది గమనించి నేను అతడి ప్రతి చిన్న పనినీ ప్రత్యేక శ్రద్ధతో గమనిస్తూ ప్రోత్సహించసాగాను.

దాంతో కనకరాజు నా మెప్పుదలకోసం మరింత తీవ్రంగా ప్రయత్నించసాగాడు. నా విమర్శను భరించలేకపోయేవాడు. ఎక్కడ నాకు కోపం వస్తుందేమోనన్న భయంతో నాకు నచ్చని పనులు చేసేవాడు కాదు.

అతనిలోని ఈ మార్పు కనకరాజు వాళ్లమ్మ కూడా గుర్తించింది. ఆమె తీరికగా వున్నరోజు కనకరాజును ట్యూషన్ దగ్గర దింపుతూ అంది ''ఏం మంత్రం వేశారోగానీ మీకు చెప్తానని బెదిరిస్తే చాలు అయిష్టమైన పని కూడా ఇష్టంగా చేస్తున్నాడు.''

కాస్తంత ప్రేమ చూపిస్తే చాలు పిల్లలు మైనం ముద్దలవుతారు. ఈ విషయం ఈమెకెలా చెప్తే అర్థం అవుతుంది?

''మావాడిని ఇంజనీర్‌ని చేయాలని వుంది. కాస్త వాడి దృష్టిని ఆవైపు మళ్లించండి'' అంది ఇంకోరోజున.

నేను నవ్వి ఊరుకున్నాను. ఎందుకంటే కనకరాజుకు లెక్కలు అస్సలురావు. అతని దృష్టి పూర్తిగా సాహిత్యం పైనే వుంది. పాఠాలయిన తరువాత అందరూ వెళ్లిపోయినా కనకరాజు ఉండేవాడు. నేను అతనికి కొన్నిరోజులు తెలుగు పద్యాలు, కవితలు వివరించేవాడిని. మరి కొన్నిరోజులు షెల్లీ, వర్డ్స్‌వర్త్‌ల కవితలు చెప్పేవాడిని.

కళ్ళు పెద్దవి చేసుకుని వినేవాడు. ఆ వయసులోనే కనకరాజు కవితల్లోని సున్నిత భావాలకు స్పందించేవాడు. అతని భావ తీవ్రత నాకే ఆశ్చర్యం కలిగించేది. ఇక అదే లోకం అన్నట్లు ఆ పుస్తకాన్ని వదిలేవాడుకాదు.

ఫలితంగా మార్కులు తక్కువ వచ్చాయి.

''నీకు మార్కులు తక్కువ వస్తే మీ అమ్మ ట్యూషన్ మాన్పించేస్తుంది'' అన్నాను కనకరాజుతో.

కనకరాజు పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కళ్ళు ఎర్రబడ్డాయి.

''నాకిష్టమైన పని ఒక్కటీ నన్ను చెయ్యనివ్వరు?'' అరిచాడు.

అతని ఆవేశం అతనిలో తొంగివున్న ఆలోచనలకు, ఆశలకు ప్రతిబింబం. మరుసటిరోజు వాళ్ళమ్మని కలిసాను.

''చూడండి. పిల్లలను క్రమశిక్షణలో పెంచడం మంచిదే. కానీ మరీ ఉక్కుపిడికిలితో పెంచితే కష్టం. మీరు అంతా వారి మంచికే చేస్తున్నామన్న ఉద్దేశ్యంతో వుంటారు. కానీ పిల్లలకు తమ స్వేచ్ఛని హరిస్తున్నారని మీపై ద్వేషం కలిగి మీ ఇష్టానికి వ్యతిరేకంగా కావాలని ప్రవర్తిస్తారు. మిమ్మల్ని బాధపెట్టి ప్రతీకారం తీర్చుకుంటున్నట్లు సంతృప్తి పడతారు.''

ఆమెకు అర్థం కాలేదు. కోపం వచ్చింది.

''అంతకుముందే కాస్త నయం. మీ ట్యూషన్‌కి వచ్చిన తరువాతే చెప్పిన మాట వినడం మానేసాడు. చదువు చెప్పడం మాని కథలు చెప్తూ పిల్లల్ని ఆకర్షించుకుని పబ్బం గడుపుకుంటున్నావు'' ఆమె ఏకవచనంలోకి దిగింది.

నేను లేచి వచ్చేసాను.

తరువాత రోజునుంచి కనకరాజు ట్యూషన్‌కు రావడం మానేసాడు. నాకు చాలా బాధ అనిపించింది.

తరువాత కనకరాజు విషయాలు తెలుస్తూనే వచ్చాయి. స్కూల్లో అతని అల్లరి మరీ ఎక్కువయిందిట. టీచర్లు ఎంత కొడితే అతను అంత సంతోషంగా ఉంటున్నాడట.

తరువాత కొన్నాళ్లదాకా అతను కలవలేదు. టెన్త్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడని విన్నాను. ఇంటర్ పరీక్షల తర్వాత అతను వాళ్ళమ్మతో గొడవ పడ్డాడుట.

తల్లి అతడిని ఎంసెట్ చదవమని వత్తిడి చేసింది. కనకరాజు తనకు ఆ చదువు వద్దని మొండికేసాడు.

వాళ్ళిద్దరి మధ్య గొడవ తీవ్రతరమైంది. కనకరాజు ఇల్లు వదిలి పారిపోయాడు. వాళ్ళమ్మ నా దగ్గరకు పరుగెత్తుకువచ్చింది.


''నువ్వే మావాడిని ఎక్కడో దాచావు'' ఆరోపించింది.

ఆ విషయం నాకేమీ తెలియదని, ఆమె చెప్పేంతవరకూ కనకరాజు ఇంట్లోంచి పారిపోయాడని నాకు తెలియదని నమ్మించేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది.

వారం తరువాత కనకరాజు దొరికాడు. నెల్లూరులో వాళ్ల తాతయ్య దగ్గరకు పారిపోయాడు.

పట్టుకొచ్చారు. మళ్లీ గొడవ మొదలు.

''నాలో గొప్ప కవి దాగున్నాడని మాస్టారు అన్నారు.



మీరు నాకిష్టంలేని పని నాతో ఎందుకు చేయిస్తారు?''

అని కనకరాజు వాదన.

''కవిత్వం తిండిపెట్టదు'' అని తల్లిదండ్రుల వాదన.

''మీరిద్దరూ నన్ను పట్టించుకోకుండా రాత్రింబవళ్ళు సంపాదించింది నాకోసమేకదా. నాకు ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏముంది?'' కనకరాజు ప్రతివాదన.

వాళ్ళ మధ్య గొడవ ఇలా నలుగుతున్న రోజుల్లో నాకో మంచి కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూ బోర్డులో కనకరాజు వాళ్ళమ్మ వుంది.

ఆ రోజు సాయంత్రం ఆమె నన్ను కలిసింది.

''నేను తలచుకుంటే నీకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది.''

నేను తల వంచుకున్నాను.

''నేను చెప్పినట్టు చేస్తే నీకా ఉద్యోగం తప్పకుండా వస్తుంది.''

తలెత్తి చూసాను.

ఆమె చెప్పింది.

తుపానులో చిక్కుకున్నట్టయింది నా పరిస్థితి.

''రేపు కనకరాజుని తీసుకుని వస్తాను. అప్పటివరకూ ఆలోచించుకో'' వెళ్ళిపోయిందామె.

నాకేం చేయాలో తోచలేదు. ఒకవంక జీవితాంతం స్థిరమైన భద్రతనిచ్చే ఉద్యోగం, మరోవంక నన్ను సంపూర్ణంగా నమ్మిన వ్యక్తికి ద్రోహం.

ఏం చేయాలి? మరుసటిరోజు సాయంత్రం కనకరాజుని తీసుకుని వచ్చింది.

కనకరాజు ఆవేశంగా అన్నాడు ''చూడండి మాస్టారూ! నా కవితలు మామూలుగా ఉన్నాయని అంటోంది అమ్మ. నిజం చెప్పండి. మీరు కనుక నా కవితలు మామూలుగా వున్నాయని అంటే నేనింక కవితల జోలికే వెళ్లను. అమ్మ చెప్పినట్లు వింటాను. మీరు బాగున్నాయంటే అమ్మ నా త్రోవకు అడ్డురానని అంది. అమ్మతో చెప్పండి'' తను కవితలు రాసుకున్న నోటుబుక్కు నాముందు పెట్టాడు.

నేను కవితలు చదివినట్లు నటించాను. మనసులో తుపాను చెలరేగుతోంది. కనకరాజు కవితలు అద్భుతం. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, విశ్వనాథలు కలిస్తే ఎలాంటి అద్భుతమైన భావాలు ఉద్భవిస్తాయో అలాంటి అద్భుతమైన భావాలు కనకరాజులో కనిపిస్తున్నాయి. కానీ...

కవితలతో కడుపు నిండే కాలం కాదిది. పైగా రేపు పెద్ద ఇంజనీరైన తరువాత కూడా కవితలు రాసుకోవచ్చు.

''కనకరాజూ! నేనేదో మాట వరుసకు అన్న మాటలను నువ్వు నిజంగా సీరియస్‌గా తీసుకుంటావని అనుకోలేదు. నేను నిన్ను ప్రోత్సహించాలని, నువ్వు సంతోషంగా ఓ పని చేస్తుంటే ఎందుకు కాదనాలని అన్నానుగానీ నీలో ఒరిజినాలిటీ లేదు. నువ్వింకో పదేళ్ళు శ్రమపడితేగానీ మంచి సాహిత్యం సృష్టించలేవు'' అన్నాను.

కనకరాజు విద్యుద్ఘాతం తగిలినట్లు బ్రాన్పడిపోయాడు. కాసేపటికి తేరుకుని తలవంచుకుని వెళ్లిపోయాడు.

కారెక్కి వెళ్లబోతున్న వాళ్ళమ్మ వెనక్కు తిరిగి వచ్చి నా చేతిలో ఓ కవర్ కుక్కి వెళ్లిపోయింది.

అది నా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్.

నేను చేసింది మంచా? చెడా?

ట్యూషన్ మానేసాను. ఉద్యోగంలో చేరాను. కనకరాజు ఇంజనీరింగ్‌లో చేరాడని విన్నాను. నేను చేసింది మంచి పనే అనిపించింది.

అలా నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఒకరోజు కనకరాజు నన్ను కలిసాడు. పక్కనే ఓ అమ్మాయి వుంది.

''నాక్కాబోయే భార్య. కవిత'' పరిచయం చేసాడు.

''మీ అమ్మ ఒప్పుకుందా?'' అడిగాను.

తల ఎగరేసాడు.

''ఇంకా నేను ఆ కనకరాజుని అనుకున్నారా? నాకేం కావాలో నాకు తెలుసు. నా కాళ్లమీద నేను నిలబడగలను. నా ఇష్టప్రకారం నేను ప్రవర్తించగలను.''

''ఈ ఆపదనుంచి కనకరాజు వాళ్ళమ్మ ఎలా తప్పించుకుంటుందో?'' అనుకున్నాను. అది త్వరలోనే తెలిసింది.

ఓ రోజు రాత్రి తలుపు దబదబా బాదుతుంటే ''ఎవరూ?' అనుకుంటూ తలుపు తీసాను. ఎదురుగా కనకరాజు.

నన్ను తోసుకుంటూ లోపలకు వచ్చాడు.

''నిజం చెప్పండి. అమ్ముడుపోని వ్యక్తి లేడని అమ్మ అంటోంది. నిజమేనా?'' సూటిగా అడిగాడు.

తల వంచుకున్నాను.

''అమ్మ కవిత వాళ్ళ నాన్నగారికి డబ్బులిచ్చింది. ఆయన కవిత పెళ్లిని వేరే ఎవరితోనో స్థిరం చేసాడు.''

నేనేం మాట్లాడలేదు.

''రెండోసారి కవితను అమ్మ నానుంచి దూరం చేస్తోంది. అమ్మకు నేనేం అన్యాయం చేసాను?'' చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

తల్లిదండ్రులు పిల్లలకేం తెలియకూడదనుకుంటారు. కానీ పసిపిల్లవాడికి సైతం తనకేం కావాలో తెలుస్తుంది. ఆకలేసినప్పుడు ఏడుస్తాడు. కడుపునిండిన తరువాత ఇంకొక్క చుక్క పాలు ఎక్కువ తాగమన్నా తాగడు. కానీ తల్లిదండ్రుల దృష్టిలో మాత్రం పిల్లలు ఎంత ఎదిగినా వారికేం కావాలో వారు తెలుసుకోలేరని అనుకుంటారు.

కనకరాజు లేచి నిలబడ్డాడు.

''నాకు మనుషులమీద నమ్మకం పోయింది.''


నేను తల ఎత్తలేదు.

కనకరాజు నా పుస్తకాల్లోంచి గీతాంజలి తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తరువాత అతను నాకేకాదు, ఎవరికీ కనబడలేదు. వాళ్ళమ్మ దేశమంతా వెతికించింది. పేపర్లలో ప్రకటనలిచ్చింది. రేడియో, టీవీల్లో బ్రతిమిలాడింది. కనకరాజు ఎక్కడా కనబడలేదు.

కానీ నేరత్వ భావనలో క్రుగ్గుతున్న నాకు ప్రతి పిల్లవాడిలో, ప్రతి వ్యక్తిలో ఏదో ఒక రూపంలో కనకరాజు కనబడుతున్నాడు. మీకెవరికీ కనబడకపోవచ్చు. కానీ నాకు చివరికి నాలో కనకరాజు కనబడుతున్నాడు. ఇప్పుడు మీకూ కనబడితే నా బాధ సగం తగ్గినట్టే...!

★

## అత్యధిక కాపీలు అమ్ముడైన పుస్తకం



ప్రపంచంలో అత్యధిక కాపీలు అమ్ముడైన పుస్తకం 'బైబిల్'. 1815నుండి 1992వరకు సేకరించిన లెక్కల ప్రకారం దాదాపు 6.1బిలియన్ కాపీలు ప్రింట్ అయ్యాయి. కింగ్‌జేమ్స్ వెర్షన్ సంవత్సరానికి 13మిలియన్ కాపీలు అమ్ముడవుతున్నాయని తెలుస్తోంది. మొత్తం ఇతరత్రా కాపీరైట్స్ పొందినవారు 14మంది వున్నారు. బైబిల్ ఇంతవరకు రెండువేల తొమ్మిది భాషలలోకి అనువదించబడింది. ఓల్డెస్ట్ పబ్లిషర్ కేంబ్రిడ్జి యూనివర్శిటీ వారు కాగా వీరే 1591నుంచి జెనీవాలో కూడా ప్రింట్ చేయడం ఆరంభించారు. ఇంతవరకూ బైబిల్ స్థానాన్ని మరేపుస్తకమూ ఆక్రమించలేదు.

\- శైలబాల

## టెలిఫోన్ బిల్లులున్నాయి- జాగ్రత్త!

టెలిఫోన్‌వారి లీలలు చిత్రాతి చిత్రంగా ఉంటాయి. న్యూఢిల్లీలోని ఓల్డ్ జవహర్‌లాల్ యూనివర్సిటీ కాంపస్‌లో ఉంటున్న ఒక వ్యక్తికి ఈమధ్య టెలిఫోన్ బిల్లు అక్షరాలా 2 కోట్ల 11 లక్షల 37 వేల రూపాయలకు వచ్చింది (కేవలం 26 రోజులకు). బిల్లు అందుకున్న ఆసామీ ధైర్యంగా ఆలోచించి- కమ్యూనికేషన్ మినిస్టర్ రామ్ విలాస్‌పాశ్వాన్ ఇంటికి ఫోన్ చేశాడు. వెంటనే పాశ్వాన్ రంగంలోకి దిగి, మహానగర్ టెలీఫోన్ నిగమ్ వారికి ఘాటుగా చీవాట్లు పెట్టాడు. వారు, బాధితునికి అసలు బిల్లు పంపారు. అది ఎంతయ్యా అంటే, కేవలం 209 రూపాయలు. పాశ్వాన్‌గారు అంతటితో ఊరుకోక, సీనియర్ ఆఫీసర్లను వచ్చి వెంటనే కలవమని ఆదేశం పంపాడు. మొహాలు చెల్లని ఆ 'దామోదరు'లు మంత్రిని కలవలేదు. ఆగ్రహోదగ్రుడైన పాశ్వాన్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ శ్రీముఖం పంపాడు.

\- కొడిమెల

